# అనుకోని సాయం

పాలకోడేటి కృష్ణమూర్తి

సమయం సాయంత్రం ఏడు గంటలు. అప్పుడే ఆఫీసునుంచి వచ్చి స్నానం చేసి టీవీ ముందు కూర్చుని టీ తాగుతున్నాను. ఇంతలో ఇంటి ముందు టెంపో ఆగిన చప్పుడయ్యింది. ఏంటా అనుకుంటూ గబగబా బయటకెళ్ళింది శ్రీమతి. టెంపోలోంచి కంప్యూటరు ఎదురింట్లో పెడుతున్నారు. వాళ్ళు కంప్యూటరు కొనుక్కున్నారు కాబోలు అనుకుంటూ శ్రీమతి ఏదో వింతను చూసినట్లు చూసి గబగబా చేతులూపుకుంటూ లోపలికి వచ్చి 'ఎదురింటి వాళ్ళు కంప్యూటరు కొన్నట్లున్నారు. మనం కూడా కొందామండీ' అంది నాతో. 'సరేలే చూద్దాం. ముందు వంటకానీ' అంటూ ఆరోజుకి ఆ ప్రస్తావన దాటవేశాను.

'ఇక ప్రతి రోజు కంప్యూటరు కొనేవరకు నిద్రపోనివ్వదు కాబోలు' అని మనస్సులో అనుకున్నాను.


"ఏంటి మీలో మీరు ఏదో గొణుక్కుంటున్నారు" అంది శ్రీమతి.

"ఆ: ఏం లేదు. నీకు కంప్యూటర్ ఆపరేట్ చేయడం రాదు కదా. కొని ఏం చేసుకుంటావా అని" అన్నాను.

"నేర్చుకుంటాను. మీరున్నారుగా నేర్పడానికి. మీరూ కంప్యూటర్ కోర్సు వెలగబెట్టారుగా.. ఆ మాత్రం నాకు నేర్పలేరా కంప్యూటర్ కొనకుండా తప్పించుకుందామని ఎత్తు కాకపోతే. అవేం కుదరవు. వెర్రి మొర్రి వేషాలు వేయకుండా రేపు కంప్యూటర్ కొని తీసుకురండి" ఆజ్ఞాపిస్తున్నట్టుగా అంది శ్రీమతి.

"అది సరే. నేర్చుకుని ఏం చేస్తావు?"

"అదేంటి అలా అంటారు. ఈ రోజుల్లో కంప్యూటర్ లేనిదే ఊపిరి తీసుకోవడం కూడా కష్టమే. అంతెందుకు రేపు మన పిల్లలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా లండన్‌లోగాని అమెరికాలోగాని స్థిరపడితే ఇక్కడ మనం ఏం చేస్తున్నామో ఏం వండుకున్నామో ఏం తింటున్నామో అన్నీ వాళ్ళకి తెలియాలికదా. ఇప్పుడు జీవితంలో కంప్యూటరు ఒక భాగమైపోయింది. అంతే కాదు మన దైనందిన జీవితంలో విడదీయరాని భాగం ఇంకొకటి వుంది. అదే ఇంటర్‌నెట్. ఇంటర్‌నెట్ కనెక్షన్ పెట్టించుకుంటే సినిమా టికెట్స్ బుక్ చేసుకోవచ్చు. ఇష్టమైన పిజ్జా ఆర్డర్ చేసుకోవచ్చు. రైలు టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు. అభినందన శుభాకాంక్షల సందేశాలు చెప్పుకోవచ్చు. తలచిన క్షణానే మిత్రులతో సంభాషించవచ్చు. అవసరమైన సమాచారాన్ని అరక్షణంలో మన ముందుకు తెచ్చుకోవచ్చు. ఫ్రెండ్స్‌తో ఛాటింగ్ జరపడం ఈ-మెయిల్స్ పంపడంలాంటివి చేసుకోవచ్చు. కంప్యూటర్ ఇంటర్‌నెట్‌ల పుణ్యమా అని మనుషుల మధ్య దేశాల మధ్య దూరం చెరిగిపోతోంది. ఇక్కడే మన ఇంట్లో కూర్చొని ఇంగ్లండులోనో ఇటలీలోనో ఉన్న మనకు ముక్కూ మొహం తెలియని వాళ్ళతో కూడా ఎంచక్కా ఛాట్ చేసుకోవచ్చు అంటే కబుర్లు చెప్పుకోవచ్చన్న మాట. మనకి ఓ కంప్యూటరు, దానికి ఇంటర్‌నెట్ కనెక్షను వుంటే చాలు. ఇక ప్రపంచం మన ముంగిట్లో వున్నట్లే!" అంటూ సుదీర్ఘమైన వుపన్యాసం ఇచ్చింది శ్రీమతి.



నిజం చెప్పాలంటే మా శ్రీమతి కోరికలు అనంతం. ఒకదాని తర్వాత ఒకటిగా ఏదో ఒకటి కొనాలని గొడవ చేస్తూంటుంది. ఇల్లు కట్టుకోవాలని, కారు కొనుక్కోవాలని, బొచ్చుకుక్కని పెంచుకోవాలని, పిల్లల్ని పబ్లిక్ స్కూల్లో వేయాలని, తన వెంట్రుకలు కత్తిరించుకోవాలని నా వెంట్రుకలు పెంచుకోవాలని, తను సల్వార్ కమీజు వేసుకుని కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుని నేను సూటేసుకొని తిరగాలని వగయిరా వగయిరాలన్న మాట. నేను ఓ మంత్రినీ కాను, పెద్ద ఆఫీసరును కాను, వ్యాపారవేత్తనూ కాను. అటువంటప్పుడు తన కోరికలు ఎలా నెరవేరతాయన్న ఇంగిత జ్ఞానం ఆమెకి లేదు.

ఓ రోజు కుక్కని పెంచుకుందామని పేచీపెడితే ఆ పోరు భరించలేక పదిహేనువందల రూపాయలకి ఓ పమేరియన్ కుక్కని కొని తీసుకొచ్చాను.దాన్ని తీసుకొచ్చిన రోజు శ్రీమతి ఆనందించిన క్షణాలు చెప్పనలవి కాదు. కొంత కాలం గడిచింది.

" ఈ కుక్క చీటికీ మాటికీ ఇల్లు వదిలి వెళ్ళిపోతోంది. ఆ తర్వాత తోక వూపుకుంటూ తిరిగొస్తోంది. మన ఇంట్లో తిని పక్కింటికి కాపలా కాస్తోంది. అచ్చం మీ లాగే ప్రవర్తిస్తోంది" అంది శ్రీమతి. ఆ

మాటలు నాకు కోపాన్ని తెప్పించాయి. అయినా ఏం చేయగలను. పెళ్ళయిన రోజే నాకున్న సర్వాధికారాలు ఆమెకు ధారాదత్తం చేసేశాను కదా.

కంప్యూటరు కొన్న తర్వాత మరేదోకటి కొనమని మొరాయిస్తుంది. ఇలా శ్రీమతి అడిగినవన్నీ కొంటుంటే ఇల్లు గడిచేదెలా. మనసులో ఒకటే ఆలోచనలు. ఆ రోజు నాకు నిద్ర పట్టలేదు.

ఏమయితేనేమి? కంప్యూటర్ కొనేంత వరకు శ్రీమతి నన్ను వదల్లేదు. శ్రీమతి అడిగినట్లుగానే ఓ రోజు కంప్యూటరు కొని తీసుకొచ్చాను.

కంప్యూటర్‌ని చూడగానే ఆవిడ మొహం చాటంత యింది. ఉత్సాహం రెట్టింపయ్యింది. దాని ముందు కూర్చోగానే కళ్ళలో ఓ రకమైన మెరుపు కదలాడింది. కంప్యూటర్‌కి సంబంధించిన రహస్యాలన్నింటిని తెలుసుకోవాలని ఉబలాటపడింది.

కంప్యూటర్ ఏవిధంగా ఆపరేట్ చెయ్యాలి. ఎలా వుపయోగించాలి, ప్రోగ్రామింగ్ అంటే ఏమిటి లాంటి విషయాలు వివరంగా రాసి ఇమ్మంది. నాలుగు రోజులు శ్రమించి అన్నీ సవివరంగా రాసిచ్చాను.

'రేపు పండక్కదా పట్టుచీర కొనుక్కుందుగాని బజారుకెళ్దాం' అంటే ఎంత ఉత్సాహంతో ఆతురతతో బజారుకి బయలుదేరుతుందో అంతే ఉత్సాహంతో కంప్యూటర్ ఆన్ చేయ్యడం షట్‌డవున్ చేయడం నేర్చుకుంది. కానీ మౌస్ మీరు చేయి పెట్టాలంటే మాత్రం భయపడేది. పైగా మౌస్ రెండుసార్లు ఎందుకు క్లిక్ చేయాలి? ఒకసారి చేస్తే సరిపోదా అంటూ ప్రశ్నల వర్షం కురిపించేది.

ఓ రోజు ఆఫీసు నుంచి ఇంటికి రాగానే బిగుసుకుపోయి కుర్చీలో కూర్చొని వుంది శ్రీమతి.

"ఏమయ్యింది. అలా వున్నావు?" అడిగాను.

"ఏం లేదండీ. కంప్యూటర్ పాడయిందండీ మీరేమంటారోనని..."

"అదేంటి కొని నాలుగు రోజులేగా అయ్యింది. అప్పుడే పాడవడమేంటి ఏం చేశావు?"

"మీరు ఆఫీసుకి వెళ్ళిన తర్వాత కంప్యూటర్ ఆన్ చేయగానే ఎడమవైపు కింద రెండు లైట్లు ఆరడం వెలగడం మొదలైంది. నాకు చెమటలు పట్టాయి. షార్ట్ సర్క్యూట్ అయిందేమోనని భయపడి కట్టేశాను" అంది.

"ఏం కాలేదులే. ముందు టీ పెట్టు" అని టీవీ ఆన్ చేసి పడక్కుర్చీలో కూర్చున్నాను.

రోజులు గడుస్తున్నాయి.

మొత్తంమీద మా శ్రీమతి కంప్యూటర్ పరిజ్ఞానం ఒంట పట్టించుకొంది. అస్తమానం దానిముందే కూర్చొని కాలక్షేపం చేయసాగింది.

ఓరోజు ఆఫీసు నించి ఇంటికొచ్చేసరికి మిడ్డీ తొడుక్కుని కంప్యూటర్ ముందు కూర్చొని వున్న శ్రీమతిని చూసి ఆశ్చర్యపోతూ–

"అదేంటి ఆ వేషం? మిడ్డీ తొడిగావేంటి. ఫాను గాలికి మిడ్డీ పైకి లేస్తే చెడ్డే కనబడుతుంది. ఎవరన్నా చూస్తే రోజు రోజుకీ నీకు మతిపోతున్నట్టుంది" అన్నాను.

"యూనో నా దగ్గర వెబ్ కెమెరా లేదు. ఇలా ఎందుకవుతోందో ముందు నా కర్థం కాలేదు. తర్వాత అర్థమయింది ఏమిటంటే ఛాట్ చేసే అవతలి వ్యక్తికి నా వయస్సు చెప్పడంతోటే ఛాటింగ్ ఆపు చేస్తున్నాడు".

"అయితే"

"అందుకని నా వయస్సు తెలియకూడదన్న ఉద్దేశంతో ఇరవై సంవత్సరాల అమ్మాయిలా ఉండాలని ఇలా తయారయ్యి ఛాటింగ్ చేస్తున్నానన్న మాట. డోంట్ డిస్టర్బ్‌మీ" పళ్ళికిలిస్తూ అంది శ్రీమతి.

శ్రీమతి అజ్ఞానానికి నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు నాకు. ఆమె ఛాటింగ్‌ని ఆటంకపరచడం ఇష్టం లేక నేను వంటింట్లోకి వెళ్ళి టీ పెట్టుకున్నాను. ఛాటింగ్ చేయడంలో నిమగ్నమైన శ్రీమతికి టీ కప్పు అందించి పతిధర్మం నిర్వహిద్దామని అనుకుంటుండగా టీ గిన్నె చేతిలోంచి జారి కిందపడింది. గిన్నె చప్పుడుకి శ్రీమతి ఉలిక్కిపడినట్లుంది.

"ఏంటా చప్పుడు. మంచి మూడ్‌పాడు చేశారు" అంటూ ఓ గావుకేక పెట్టింది.

"టీ తయారు చేస్తున్నాను" అన్నాను పొడిగా.

"ఒళ్ళు దగ్గర పెట్టుకుని పని చేయమని ఎన్నిసార్లు చెప్పాను మీకు. ఇరవై సంవత్సరాలుగా ఏమీ నేర్చుకోలేకపోయారు. ఎదురింటాయనను చూడండి ఇంటిపనీ వంటపనీ ఆయనే చూసుకుంటాడు. నెల తిరిగేసరికి జీతం మొత్తం తెచ్చిపెళ్ళాం చేతిలోనే పోస్తాడు. ఫోను, ఫ్రిజ్, టీవీ, ఎయిర్ కండీషనరు, వాషింగ్ మెషిన్, ఓవెన్, పోర్టికోలో తళతళలాడే కారు. దేనికీ కొరత లేదు. ఆ ఇంటావిడ రోజుకి మూడు చీరలు మారుస్తుంది. నేనేమో ఆరు నెల్లనించి మారుచీరతోనే నెట్టుకొస్తున్నాను. నా నుదుట మిమ్మల్నే రాసిపెట్టాడు ఆ భగవంతుడు" అంది శ్రీమతి తెగబారెడు నిట్టూర్పు విడుస్తూ.

"అలాగా వాళ్ళ విషయం పోనీ. ఇంద నా చేతితో తయారు చేసిన టీ తాగు" అన్నాను.

"ఇది టీయా కాషాయమా? ఇలా వుందేం" టీ తాగుతూ మొహం చిట్లించి అంది శ్రీమతి.

అలా అందేకాని కప్పు మొత్తం ఖాళీ చేసింది.


నిజం చెప్పాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం సంతరించుకున్న తర్వాత శ్రీమతిలో చాలా మార్పు కనబడసాగింది. ఆమె ఇప్పుడు బ్యూటీ పార్లర్‌కి వెళ్ళి ఫేషియల్, ఐబ్రో, హెయిర్‌సెటింగ్ వగైరా వగైరాలు చేయించుకోవడంలో అధిక సమయం తీసుకోసాగింది. చీరకట్టులో బొట్టులో ఎక్కువ శ్రద్ధ చూపటం మొదలు పెట్టింది.


ఇంటిపని గురించి పట్టించుకోకపోయినా వంటింటి వైపు చూడకపోయినా అద్దం ముందు మాత్రం గంటలకు గంటలు గడపసాగింది. దాంతో నాకు ఆఫీసు పనికి తోడు ఇంటి చాకిరీ ఎక్కువైపోయింది.

ఒకరోజు శ్రీమతి మూడ్ గమనించి "చూడు మనకంటూ ఓ సంసారం తగలడింది. దాన్ని సరైన రీతిలో కాపాడుకునే దృష్టి సారించాలి. అంతే కాని నువ్విలా మాటిమాటికీ బ్యూటిపార్లర్లకెళ్ళడం, ఇరవై నాలుగ్గంటలూ కంప్యూటర్ ముందు కూర్చోవడం చేస్తే ఎలా?" అన్నాను.

వెంటనే శ్రీమతి కోపంగా నా వైపు చూస్తూ "ఈ కంప్యూటర్, ఇంటర్‌నెట్, ప్రపంచీకరణ నా కళ్ళు తెరిపించాయి. మహిళలు పురుషులకి లోబడి వుండే రోజులు పోయాయి. స్వేచ్ఛగా జీవించే హక్కు మాకుంది. మీరు నాకు సలహాలు చెప్పాల్సిన పని లేదు. ఏ పని ఎక్కడ ఎప్పుడు ఎలా చేయాలో ఎప్పుడు ఎలా ప్రవర్తించాలో నాకు బాగా తెలుసు. మీకేం తెలుసు. మనిషి టిప్‌టాప్‌గా వున్నప్పుడే వ్యక్తిత్వం సొగసు సంతరించుకుని మరింతగా ఇనుమడిస్తుంది. మీరు కేవలం నా భర్త మాత్రమే. అది గుర్తుంచుకోండి. భర్తగా ఉండడమే అలవర్చుకోండి. గైడ్‌గా మారాలని అనుకోవద్దు. అలా ఉంటేనే మనిద్దరికీ మంచిది" అని ఆ తర్వాత కంప్యూటర్‌తో ఆటలాడుకోసాగింది.

నేను మరేమీ మాట్లాడకుండా ఈ మధ్య నాకు ప్రియనేస్తంగా మారిన పమేరియన్ కుక్కకున్న బెల్టు పుచ్చుకుని బయటికి వెళ్ళిపోయాను.






ఆ రోజు సాయంత్రం టీవీ చూస్తూ ఏ కళనుందో మా శ్రీమతి తను స్వయంగా కాచి చేతికందించిన కాఫీ చప్పరించసాగాను. ఒకటి రెండు గుక్కలు తాగానో లేదో వాంతి వచ్చినట్లయింది. చిరాగ్గా మొహం పెట్టి " నువ్వు కాస్త జ్ఞానం తెచ్చుకుని ప్రవర్తించు కంప్యూటర్ లేకపోతే కాలమే గడవదు జీవితమే లేదన్నట్టుగా ప్రవర్తిస్తున్నావు కాఫీలో పంచదార బదులు సాల్ట్ తగలెట్టినట్టున్నావు కాఫీ వుప్పు కాషాయం" అన్నాను.

"రాత్రి పగలు నన్ను, నా కంప్యూటర్‌ని దెప్పిపొడవడం తప్ప వేరే పని లేదా మీకు. నేను కంప్యూటర్ ముందు కూర్చుంటే చాలు కళ్ళలో నిప్పులు పోసుకుంటారు. ఇదిగో ఆఖరిసారిగా చెబుతున్నాను. జాగ్రత్తగా వినండి. భార్యలు గృహహింసకి బలయ్యే అలనాటి పాత రోజులు పోయాయి. ఇప్పుడు కంప్యూటర్ పరిజ్ఞానానికి ఇంటర్నెట్ తోడయ్యి ప్రపంచీకరణ నేపథ్యంలో మాకున్న అధికారాలేంటో, హక్కులేంటో మేం తెలుసుకున్నాం. మాకు కూడా స్వేచ్ఛగా జీవించే హక్కు వుందని గ్రహించాం. అంతే కాదు భౌతికంగా, లైంగికంగా, మౌఖికంగా, మానసికంగా, ఆర్థికపరంగా మహిళను వేధించినా, అలా బెదిరించినా గృహహింసలో భాగమే అవుతుంది. గృహహింస చట్టం కింద బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదే చేయవచ్చు. చచ్చిచెడి కాచి చేతికిచ్చిన కాఫీకి కూడా వంకలుపెడుతూ నన్ను హింసిస్తున్నారని రిపోర్టు చేస్తే పోలీసులు వచ్చి గృహహింస కింద మీమీద కేసు నమోదు చేసి తీసుకెళతారు తెలుసా?..." అంటూ గుడ్లురుముతూ అంది శ్రీమతి.

ఆరోజు ఆదివారం. రాత్రి ఎనిమిదయ్యింది. ఉరుములు, మెరుపులతో మేఘాలు ముసురుకున్నాయి. వర్షం కురుస్తోంది. వాతావరణం చలిగా వుంది. అంతేకాదు. వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. దాంతో శ్రీమతితో మాటా మంతీ ఆడుకుంటూ కులాసాగా కాలం గడపాలని అనిపించింది. అదివరకు టీవి ఇప్పుడు కంప్యూటర్ ఇంట్లో తిష్టవేశాక మా మధ్య మాట్లాడుకోవడమే కరువైపోయింది. కొంచెం సేపు కబుర్లు చెప్పుకుందామనిపించి శ్రీమతి దగ్గరకి వెళ్లి ఏదో మాట్లాడబోయాను. అంతే 'మంచి రోమాంటిక్ ఛాట్ పాడు చేశారంటూ' అగ్గిమీద గుగ్గిలం అయింది శ్రీమతి. తర్వాత విసుగ్గా లేచి కంప్యూటర్ షట్‌డవున్ చేసి పడగ్గదిలోకి వెళ్లిపోయింది శ్రీమతి. నేనూ ఉసూరుమంటూ గదిలోకి వెళ్లి మంచంపై పడుకుండిపోయాను.

అర్థరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా నాకు నిద్రాభంగమయ్యింది. మంద్రమైన నీలిరంగు బెడ్ లైట్ కాంతిలో శ్రీమతి తన దిండు కింద వున్న మొబైల్ ఫోన్ తీసుకొని పడుకునే చెవులకి ఆనించుకుంది. ఎవరితోనో గాని ఏదో మాట్లాడుతోంది. ఇంతలో 'తలుపు తీయండి' అంటూ ఓ మగ గొంతు పిలవడం వినపడింది.

శ్రీమతి నా వంక చూసింది. అది గమనించి నేను కళ్లు మూసుకొని గాఢ నిద్రలో వున్నట్లు నటించసాగాను. శ్రీమతి నెమ్మదిగా మంచం దిగి పాదాలు శబ్దం కాకుండా తలుపు వైపు నడిచింది. ఈ సమయంలో కాల్ ఎవరిదైయుంటుందబ్బా... నా చెవులు నిక్కబొడుచుకున్నాయి.

శ్రీమతి తలుపులు తీయగానే ఎవరో నెమ్మదిగా అడుగలు వేస్తూ లోపలికొచ్చారు. ఆ తర్వాత తలుపు తీసిన చప్పుడు వినబడింది. కొంత సేపు ఏదో గుసగుసలు వినిపించాయి. కానీ మాటలు నా చెవిన పడలేదు.

"వచ్చింది ఎవరయ్యుంటారబ్బా?" నా మస్తిష్కంలో పురుగు తొలచినట్టు సందేహం తొలచసాగింది. 'పోలీసులు కాదు కదా కొంప తీసి' అనుకున్నాను.

అంటే నిజంగానే గృహహింస నేరం కింద నన్ను అరెస్ట్ చేయించాలని నిశ్చయించుకుందా? అనుకున్నాను. నా చేత బలవంతంగా కంప్యూటర్ కొనిపించి నా వల్ల కంప్యూటర్ జ్ఞానం సంపాదించి ఇన్ని సంవత్సరాలు నాతో వైవాహిక జీవితం గడిపిన తను నాపై పోలీసు కేసు పెడుతుందా?.... అనుకున్నాడు.

ఇంతలో శ్రీమతి నెమ్మదిగా వచ్చి మంచం మీద పడుకుంది.

" ఎవరా వచ్చింది?" అన్నాను గట్టిగా.

" ఉష్ అరవకండి ఏదో కొంప మునిగిపోయినట్లు" అంది ఆవిడ కఠినంగా.

ఇంతలో తలుపు దగ్గర ఎవరో మనిషి నిలబడి వున్నట్లు అలికిడి అయింది.

" ఎవరది?..." అన్నాను భయం భయంగానే.

"నేనే బావా... ఏమిటంత కంగారుపడుతున్నావు?" అంటూ వచ్చాడా మనిషి. అతను మరెవరో కాదు. మా ఆవిడ తమ్ముడు నాకు వరసకు బావమరిదీ అయిన ప్రకాశం.

"ప్రకాశం నువ్వా?" అంటూ నేను ఆశ్చర్యపోతూ లేచి కూర్చున్నాను.

"అవును నేనే. హెడ్డాఫీసులో అర్జంటు పనుండి వచ్చాను. అర్థరాత్రిపూట కాలింగ్ బెల్ నొక్కి నీకు నిద్రాభంగం కలిగించడం ఇష్టం లేక అక్కయ్య మొబైల్ ఫోన్ చేసిన నేను వచ్చానని తలుపు తీయాల్సిందని చెప్పాను." అన్నాడు ప్రకాశం. కాసేపు ఊరుకుని " ఎందుకు మీరంత భయపడుతున్నారు" అన్నాడు. నేను మాట్లాడలేదు.

మా ఆవిడ అందుకొంది. " ఆయన తీరే అంత ప్రతిదానికి కంగారే" అంది.

"అవును..అవును..నిద్రలో ఏదో భయపడ్డాను" అన్నాను నన్ను నేను సర్దుకుంటూ.

ఇంతలో మా బావమరిది కంప్యూటర్ వైపు చూస్తూ " ఇదెప్పుడు కొన్నారు? చాలా బాగుంది" అన్నాడు.

" ఈ మధ్యనే కొన్నాను. మీ అక్క పట్టుబట్టింది. కంప్యూటర్ కావాలని. మీ అక్క కంప్యూటర్ వర్క్‌లో నిష్ణాతురాలైంది. ఇప్పుడు రోజంతా కంప్యూటర్‌తోనే కాలక్షేపం చేస్తోంది. మొగుడికంటే కంప్యూటర్ ఎక్కువైంది తనకి" అన్నాను అక్కసుగా.

"మీ బావగారు ఎప్పుడూ ఇంతేరా.... తమ్ముడూ. ఇలానే మాట్లాడతారు. అది సరే నువ్వూ కంప్యూటర్ కొనాలని అనుకుంటున్నావుగా. ఎంతవరకు వచ్చింది?" అంది శ్రీమతి.

"లేదక్కా. కుదరడం లేదు. ఇప్పటికే చాలా కమిట్‌మెంట్సున్నాయి. డబ్బుకి ఇబ్బందిగా వుంది. అందుకే కొనలేకపోయాను." అన్నాడు మా బావమరిది. కొంచెం సేపు ఆగి. "అక్కా ఒక్కమాట అడుగుతాను ఏమనుకోవు కదా..?" అన్నాడు.

" ఏమనుకుంటాను. అడుగు తమ్ముడు" అంది ధారాళంగా.

"మరేం లేదు. నాకు కంప్యూటర్ చాలా అవసరంగా ఉంది. ఉద్యోగంలో నాకు ప్రమోషన్ వచ్చే విషయం కంప్యూటర్ పరిజ్ఞానం మీదే ఆధారపడి వుంది. ప్రస్తుతానికి నీ కంప్యూటర్ నాకు ఇయ్యి అక్కా. నేను కొనుక్కున్న తరువాత మీ కంప్యూటర్ మళ్లీ మీకు భద్రంగా ఇచ్చేస్తాను" అన్నాడు.

ప్రకాశం మాటలు నాకు వీణపాటలా వినిపించాయి. కంప్యూటర్ పీడ వదిలించుకోవడానికి ఇదే మంచి సమయం అనిపించింది.

మా శ్రీమతి మాత్రం మాట్లాడలేదు. కంప్యూటర్ ఇవ్వడం ఆవిడకు ఇష్టం లేదని తెలుస్తూనే వుంది. అయినా నేను కలిగించుకొని...

"అలాగే ప్రకాశం. దానికేం భాగ్యం తీసుకెళ్లు. ఉద్యోగంలో ప్రమోషన్ వస్తోందంటే మీ అక్కయ్యే మాత్రం కాదంటుందా? అలానే పట్టుకెళ్లు. నువ్వేం పరాయివాడివా మాకు" అన్నాను.

"థ్యాంక్స్ బావా...రేపే తీసికెళ్లిపోతాను" అంటూ సంతోషంగా గదిలో నుంచి బయటకొచ్చిన ప్రకాశం అంత రాత్రి వేళ కంప్యూటర్‌ను ప్యాక్ చేసే ప్రయత్నంలో పడిపోయాడు.

ఆ శబ్దాలకు గుడ్లురిమి నా వంక చూస్తున్న మా శ్రీమతి వైపు చూడకుండా దుప్పటి ముసుగు పెట్టి గుర్రు కొట్టడం ప్రారంభించాను.

★